కథానిక

# పొరలుకమ్మిన కళ్లు

అవసరాల రామకృష్ణరావు

జర్నలిస్టు గిరిజ రాస్తున్న "రాతలూ, చేతలూ" అనే పెద్దకథ అప్పుడే పూర్తయింది. రాసిరాసి అలసిపోయిన కలానికి విశ్రాంతి యిచ్చి, గిరిజ పడకకుర్చీలో పడుక్కుని తన కథ మళ్ళీ మరోసారి పూర్తిగా చదవడం మొదలెట్టింది. పదినిముషాలు గడిచే సరికి గిరిజ రెండుచెంపలూ తడిసిపోడం ఆమెకే ఆశ్చర్యం కలిగించింది. ఆమె యింతకుముందు చాలా కథలు రాసిందిగాని యిలా కథలతో ఐక్యమయిపోయి ఆమె ఎప్పుడూ వాటి కష్టసుఖాలు పంచుకోలేదు. "ఎంత బాగుంది! గొప్ప జీవల సంఘర్షణ ఎంత చక్కగా చిత్రించాను! ఇలాంటి కథలు నాలుగు చదువుతే సంఘంలో తప్పకుండా సంచలనం కలుగుతుంది!" అంత చక్కగా కథ రాసి ఈమాత్రం ఆత్మస్తుతి చేసుకోడంలో గిరిజకేమీ తప్పు కనబడలేదు. తను రాసిన కథ చదువుకుని ఆమెను ఆమె అభినందించుకోకుండా ఉండలేకపోయింది.

అన్నయ్య ఆ పక్కనుంచి హడావిడిగా వెడుతున్నాడు.

"మళ్ళీ ఏం కేసు వచ్చిందిరా అన్నయ్యా!" అని అడిగింది కథను దాచేసి

"ఇంట్లో కేసేనే! అమ్మకి కంట్లో నలక పడింది."

"కంట్లో నలకపడితే అంత హడావిడి దేనికిరా?"

"నువ్వు జర్నలిస్టువి కనక నీకు కథల్లో పాత్రలలోనే గాని బ్రతికున్న వాళ్ళ కష్టసుఖాలు అక్కర్లేదు. కంట్లో నలక అంటే ఎంత బాధో నీకేం తెలుసు? 'కంటిలోన నలుసు కాలిముల్లు' అన్నారు. అమ్మ ఎంత బాధపడుతోందా చూడు తెలుస్తుంది?"

గిరిజ అమ్మదగ్గిరకి వచ్చింది.

"అన్నయ్య కళ్ళస్పెషలిస్టు కాదు గాని ఎవరి కంటిమీదా యీగ వాలనియ్యడం లేదే గిరిజా! దారితప్పివచ్చి నా కంట్లో చిన్న నలక పడింది. చెప్పకపోయి నా బాగుండును, కన్నంతా కడిగాడు. ఏవేవో మందులు వేసేడు. ఊం నానా రాద్ధాంతం చేస్తున్నాడు."

"నాకేం? అలాగే ఉండనియ్యండి. కంట్లో నలకలు రాక-సెలుకొద్దీ బాధపడినవాళ్ళున్నారు. కన్ను వాచిపోయి చేతిలోకి వస్తే అప్పుడు నా దగ్గిరకొద్దురు గాని" అన్నాడు అన్నయ్య అమ్మ కన్నులోకి ఊదుతూ.

"అమ్మా!" అందరూ అటు తిరిగి చూశారు. స్వరం పోల్చి అన్నయ్య అన్నాడు:

"మళ్ళీ వచ్చింది కొబోలు పైడమ్మ! డబ్బు తెస్తేగాని నేనేం చెయ్యలేనని చెప్పెయ్యవే గిరిజా! అబ్బబ్బ, ప్రాణాలు కొరికేస్తోంది. ఇదేం ధర్మసత్రవనుకుంది కొబోలు- అమ్మ అనలే బాధపడుతోంది. వెళ్ళి పంపించెయ్యవే గిరిజా!"

గిరిజ మనసు అనేకమయిన కరుణాపూరిత ఆలోచనలతో కొట్టుకుంది. ఏదో తప్పుచేసిన దానిలా అడుగులో అడుగు వేసుకుంటూ మూడంతస్తులూ దిగి క్రిందికొచ్చింది

మెట్ల దగ్గిర అరుగుమీద పైడమ్మ మనవడి మీద చెయ్యివేసుకుని కనపడని ఏ లోకంలోకో చూస్తూ కూర్చుంది.

"ఏమే పైడమ్మా, ఎలా ఉన్నావ్?"

"ఎవరు తల్లీ? గిరిజమ్మగారా? ఇలా దగ్గిరగా రండి తల్లీ! కనపడదు కళ్ళు పూర్తిగా మూసుకుపోయాయి. మిమ్మల్నందర్నీ చూద్దామని నా ప్రాణం ఎంత కొట్టుకపోతోందో చెప్పలేను, గుడ్డిముండని. ఇంకెన్నాళ్ళో బతకను. ఓసారి చూసిపోదామని వచ్చాను తల్లీ! గిరిజమ్మతల్లీ. బాగున్నారా?"

పైడమ్మ గిరిజ గెడ్డాన్ని తడుముకుని పట్టుకుని ముద్దెట్టుకుంది.

గిరిజ ఒకసారి పైడమ్మ కళ్ళవైపు చూసింది.

అలాంటి కేసులు అన్నయ్యదగ్గిరకు రావడం తను ఎన్నిసార్లో చూసింది. ఆశతో ఆమెకళ్ళు మెరిశాయి.

"అదేమిటి పైడమ్మా! నువ్వలా ఆశ్చర్యపడి పోతే ఎలా? నీ కళ్ళు పుట్టుకలో పోయినవి కాదుగా. ఆపరేషన్ చేస్తే మళ్ళీ వస్తాయి. మా అన్నయ్య ఉన్నాడుగా నీకేం భయం?"

పైడమ్మ నిరాశతో నవ్వింది.

"అయ్యో వెర్రితల్లీ. అన్ని ముచ్చట్లూ తీరేయి!"

"అంటే? మా అన్నయ్య కళ్ళు రావన్నాడా?"

"బాబుగారు కళ్ళొస్తాయనే అన్నారు. ముప్పైరూపాయలు తెమ్మన్నారు."

గిరిజ క్షణంసేపు పైడమ్మ మాటలు నమ్మలేకపోయింది. పైడమ్మ తనకి జ్ఞానం వచ్చిందగ్గిర్నుంచీ వాళ్ళయిల్లు కనిపెట్టుకున్న మనిషి. ఈమధ్య కళ్ళుపోయి పనిమానేసిందిగాని తననీ అన్నయ్యనీ చిన్నప్పట్నుంచీ ప్రాణపదంగా పెంచింది. అలాంటి అన్నయ్య తన నోటితోనే పైడమ్మని డబ్బు పట్టుకు రమ్మన్నాడా?

"పైడమ్మా. నువ్వు పొరపాటున విన్నావేమో. మా అన్నయ్య అలా అనే రకం కాదు."

"లేదమ్మా. నా చెవులతో నేను విన్నాను. అయన అలాగే అన్నారు. అభిమానముంటే ఉండొచ్చు డబ్బు పెట్టడం దగ్గిరే వస్తుంది అని నేను ముందే అన్నాను. కాని మాయింట్లో వాళ్ళందరూ చిన్నప్పట్నుంచీ పెంచావు, ఈమాత్రం ఉపకారం చెయ్యరా? వెళ్ళి ఆయన కాళ్ళమీద పడు అన్నారు. గంపెడాశతో మనవడ్ని వెంటబెట్టుకుని మొన్న సోమవారంనాడు వచ్చాను. నా బాబు కరుణించలేదు. అది నా దురదృష్టం. దానికి నేనెవర్నీ ఏమీ అనను. కాని..."

"ఏమిటి పైడమ్మా, చెప్పు?"

"ఏంవింటారు తల్లీ, మా పేదవాళ్ల కథలు! నెత్తిమీద పెట్టుకునే కొడుకు, కోడలు ఉన్నారు. రోజుకి ఒకటీ రెండూ తెచ్చి ఇన్ని గంజినీళ్ళు కాచిపోస్తారు. అంతేగాని యిరవైలూ ముప్పైలూ ఎక్కడ తేగలరు తల్లీ! ఎక్కడచూసినా కటికచీకటి! ఆయినా యిలాంటి దిక్కుమాలిన గాథలు మీకెందుకు తల్లీ!"

గిరిజ మనసు కరుణార్ద్రమైపోయింది. బీదల దుఃఖాలు విన్నకొద్దీ కరుణామయహృదయం తెలియనిబాధతో ఊగిసలాడింది.

"చెప్పు పైడమ్మా, యింకా ఏం జరిగింది?"

"ప్రపంచమంతా గాఢాంధకారం. ఈ కళ్ళు మళ్ళీ ఎలా వస్తాయి అన్న ఆందోళన. ప్రజల ముఖాలకోసం ముఖం వాచిపోయాను, రాత్రీ పగలూ కంటికి కునుకులేదు. ఇలా యమబాధపడిపోయాను. ఇది చూసి నా కొడుకు హడలిపోయాడు. బావురుమని ఏడ్చాడు. ఈ ఏడుపు విని మా గూడెం వాళ్ళందరూ ఒకటీ రెండూయిచ్చారు. అనుభవించినవాళ్ళకే ఎప్పటికయినా బాధలు అర్థమౌతాయి తల్లీ! అంతా మొత్తం యిరవై రూపాయలు పోగయ్యాయి. ఆ రోజుల్లా మనసు ఆశతో నిండిపోయింది...కళ్ళొచ్చినట్టే మురిసిపోయాను. కాని అదృష్టముండొద్దు గిరిజమ్మ తల్లీ!"

కనపడని పైడమ్మ కళ్ళల్లోంచి రెండు కన్నీటిచుక్కలు కారి గిరిజ కాళ్ళమీద పడ్డాయి. గిరిజ మనసులో ముళ్ళతో గుచ్చినట్టు బాధపడింది

"ఇంకా పదిరూపాయలు కావాలిగా తల్లీ! అవిమాత్రం ఎక్కడ్నుంచి వస్తాయి? మా వాళ్ళల్లో బియ్యంతెచ్చి దొంగతనంగా అమ్ముకునే పద్ధతుంది. నా కొడుకు ఎప్పుడూ అలాంటివి చెయ్యలేదు. కాని నా కోసమని తనూ నా కోడలు వద్దని పోరుతున్నా దానికి సిద్ధపడ్డాడు. ఏమయింది, అలవాటులేక చేతిలో మూటతో సహా పట్టుబడ్డాడు. ఉన్న యిరవై రూపాయలూ లంచమిచ్చి నా కొడుకుని నేను దక్కించుకునేసరికి తాతలు దిగొచ్చారు తల్లీ! ఇవన్నీ ఎందుకుగాని, గిరిజమ్మగారూ అమ్మగార్ని ఒక్కసారి దయయుంచి మేడదిగి రమ్మనండి. రాలేనంటే ఎలాగో తడుములాడుకొని నేనే వారి పాదాలదగ్గిరకొస్తాను...ఇంక ఏ దారీ లేదు. గుడ్డిముండని. బెంగతో ఎన్నాళ్లో

బతకను! మళ్ళీ రాగలనో లేనో. ఒక్కసారి అమ్మగార్ని పిలవండి గిరిజమ్మ తల్లీ!”

గిరిజ మనసు మరో ఆలోచనల్లో విహరిస్తోంది.

“పైడమ్మా! నువ్వనవసరంగా బెంగపెట్టుకోకు. నీకు కావలసిన సొమ్ము నేనిస్తాను. నువ్విక్కడే ఉండు, నేనిప్పుడే వస్తాను.”

ఏదో తృప్తితో తేలికయిన మనసుతో గిరిజ పైడమ్మ సమాధానానికేనా చూడకుండా మూడంతస్తులూ ఎక్కి పైకి వచ్చింది.

“ఏమే ఎంతసేపటికీ ఊడిపడవు? పైడమ్మ మంచీ చెడ్డా కనుక్కోడానికి కాబోలు వెళ్ళేవు. మరోకథావస్తువు సంగ్రహిద్దామనా?” అన్నయ్య పకపకనవ్వుతూ అడిగేడు, అతని నవ్వు గిరిజమొహం చూడగానే ఆగిపోయింది.

“కళ్ళులేక రాత్రీపగలూ యింటిని కనిపెట్టుకున్న దిక్కులేనిది అలా లక్ష్మణా అని ఏడుస్తూంటే నీకంత నవ్వుగా ఉందన్న మాట?”

“అయితే మధ్యని నష్టం చెయ్యమంటావ్?”

“ఆమాట నేనే చెప్పాలన్నమాట? నువ్వు చూపించే ప్రతిఫలం యిదేనన్నమాట?” అన్నయ్య హఠాత్తుగా లేచి అభినయిస్తూ అన్నాడు:

“నీకు హృదయంలేదూ? నువ్వు మనిషివి కాదూ?” అనికూడా అడుగు గిరిజా! అక్కడికి సరిపోతుంది! ఇలాచూడు చెల్లీ-ఇష్టమైనట్లు దానధర్మాలు చెయ్యడానికి యివి సినిమాల్లో పాత్రలుగాని కథల్లో వ్యక్తిత్వాలుగాని కావు కనపడే బీదవాడికల్లా యిలా ఉచితంగా ట్రీట్మెంటు చేస్తే నేనెలా బతకగలను?”

“అవును పాపం, ఎలా బతకగలవు? అలా చెయ్యకపోతే నీకంత ఫర్నిచరు వస్తుందా? ఈ మూడంతస్థులమేడ వస్తుందా? కష్టపడి గడించావు పాపం!”

ఇక అమ్మ ఊరుకోలేకపోయింది

“మీ కిద్దరికీ మరేం కాలక్షేపంలేదా ఏమిట్రా? తీరి కూర్చుని పై మనిషిని పురస్కరించుకుని యీ కొట్లాట ఏమిటే?”

“లేకపోతే ఏమిటే? ఎవరికి వాళ్ళ తల్లుల మీద ప్రేమ ఉండదూ? ఇందాక నీ కంట్లో నలకపడితే వాడు అలా గిలగిలలాడిపోయాడు కదా, పైడమ్మ కళ్ళేపోతే అదీ దానికొడుకూ ఎంత బాధపడుతున్నారో కొంచెం ఆలోచించొద్దూ?”

“నన్ను ఊఁ అనకపోతే చిన్నప్పట్నుంచీ నిన్నూ పైడమ్మ పెంచిందికదా, దాని కళ్ళేవో బాగుచేయించి ఆ పుణ్యం కట్టుకోకూడదూ?”

“ఆ మాట నువ్వు చెప్పేదేమిటి?” అనుకుంటూ గిరిజ అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

“వయస్సు వచ్చినా లోకానుభవం రాలేదు గిరిజకి” అంది అమ్మ.

“ఏదొచ్చినా రాకపోయినా కబుర్లు వచ్చునుగా?” అన్నాడు అన్నయ్య

గిరిజ గదిలోకి వెళ్ళింది. బీరువా తాళం తీసి తను ఎన్నాళ్ళనుంచో కష్టపడి దాచుకున్న ముప్ఫైరూపాయలూ చీరమడతల్లోంచి ఇవతలికి తీసింది. దానధర్మాలు చెయ్యకుండా అందరు ధనికుల్నీ ఎదిరించిన ప్రశ్నలే ఆమెనీ నిలదీశాయి.

“మూడునెలలనుంచీ దాచాను...ఒకటి రెండు కాదు...ముప్ఫైరూపాయలు! ఎన్నాళ్ళు సంపాదిస్తే వస్తాయి ముప్ఫైరూపాయలు? ఒక్కసారి ఎలా యిచ్చెయ్యను?

“ఏమిటో అన్నీ అనుకుంటాం. అనుకున్నవన్నీ చేస్తే ఈ ప్రపంచం యిలా ఎందుకుంటోంది? అయినా యీ ప్రపంచంలో దీనిలాంటి వాళ్ళు ఎంతమందున్నారో, ఎంతమందికని సాయం చెయ్యగలం!

“అయినా యీ ముప్ఫై యిచ్చినా దీనికి కళ్ళు వస్తాయని నమ్మకేమిటి? ఒకవేళ వచ్చినా కళ్ళువస్తాయిగాని యీ స్వల్పధనంతో దీని జీవితం వెళ్ళిపోతుందా?

“అయినా అన్నయ్యకి నాపాటి ఆలోచనాజ్ఞానమే లేకపోయిందా? ఒకవేళ అన్నయ్య తప్పే చేస్తే అమ్మ ఏమీ అనకుండా ఎందుకూరుకుంటుంది? వీళ్ళిద్దరికన్న నేను తెలిసినదాన్నా?

“ఇద్దామనుకున్నా రూపాయీ అర్ధా కాదు.. ముప్ఫైరూపాయలు. ఎలా ఇవ్వను?”

గిరిజ మూడంతస్థులూ మళ్ళీ దిగి పెద్దమ్మ దగ్గిరకొచ్చింది.

“మరోలా అనుకోకు పెద్దమ్మా, నిన్ననవసరంగా ఆశపెట్టేను. తొందరపడి అనుకున్నానుగాని ముప్ఫైలూ నలభైలూ నాకెలా వస్తాయి?”

పెద్దమ్మలో ఏ మార్పు లేకపోవడం గిరిజకు ఆశ్చర్యం కలిగించింది.

“దానికేమిటి తల్లీ, నీకు ఆ కోరిక కలిగింది అంతేచాలు. ఇంక ఆశానిరాశా అన్నావా, అలాటివాటికి యీ మనసు యిక చలించదు. శిల అయిపోయింది. వస్తాను గిరిజమ్మ తల్లీ! ఈముసలిముండని కాస్త జ్ఞాపకముంచుకోండి.”

ఆ తరవాత పదిరోజులికి గుడ్డిపెద్దమ్మ కారుకిందపడి చచ్చిపోయిందని గిరిజకి తెలిసింది. ఆమెలోని లక్షశక్తులూ ఒక్కసారి మేలుకొని ఆమెకు మనశ్శాంతిలేకుండా చేశాయి “ముప్ఫై రూపాయలు! ఒక మంచిచీర కొనుక్కున్నట్టు! ఒక్కసారి కుటుంబమంతా కలిసి నాటకానికి వెళ్ళినట్టు! నా చేత్తో చేసియ్యలేకపోయాను నావల్లే పెద్దమ్మ చచ్చిపోయింది! ఇవ్వకుండా నన్నే శక్తులు అడ్డుకున్నాయి? ప్రభూ, నాకేది శిక్ష?” అని మనసులో కుమిలిపోయింది. మూడు అంతస్థులూ ఎక్కి మేడమీదికి వెళ్ళి జర్నలిస్టు గిరిజ తను పదిరోజులు కష్టపడి రాసిన ‘రాతలూ-చేతలూ” అనే కథను ముక్కముక్కలుగా చింపేసింది.

ఆరని కొలిమి

# ఇండోచైనా యుద్ధరంగం

కాలజ్ఞానం సుబ్బారావు

ఆనాడు-అనగా డిసంబరు 19, 1946లో ఏ ముహూర్తాన అడ్మిరల్ థియరీ డి అర్జెన్‌లూ (Admiral Thierry D'Argenlieu) “హోచిమిన్! — అతగాడి గుంపు? వీళ్ళని మూడు నెలల్లో హతమారుస్తాము” అని గర్వంగా గంభీరంగా నుడివాడో కాని మూడు నెల అనేది అయిదేండ్లకు పైబడిపోవడం కాకుండా యింకా వర్తమానంలోనే ఉన్నది. అది బహుశా ఫ్రెంచిసేనాని దుర్ముహూర్తాన నిర్ణయానికి వచ్చిన ఫలితం కావచ్చును.

ఇంతకూ యీ అయిదేండ్లకు మించి కొనసాగుతూన్న స్వాతంత్ర్య సమరాన్ని ఓసారి సింహావలోకనం చేద్దాం. ఈ యుద్ధజ్వాల రేగకముందు తొమ్మిది మాసాలప్పుడు ఫ్రాన్సుకు వియట్‌నామ్ రిపబ్లిక్కుకూ ఓ సంధి జరిగింది. తత్ఫలితంగా హోచిమిన్ ఫ్రెంచి యూనియనులో ఉంటూనే స్వతంత్రానికి అంగీకరించాడు. కాని టాంకింగులో ఫ్రెంచి అవనపు సేనలు కాలు పెట్టీపెట్టక మునుపే వాటి దృక్కులు వియట్‌నామ్ జాతీయతమీద పడ్డాయి. ఇక అంతేను. అడ్మిరల్ థియరీ డి అర్జెన్‌లూ పై భాషణలని నుడవడం-ఫ్రెంచి సేనలు అతి విశ్వాసంతో దానిని చాల కేవలముగా తీసికోవడం, యుద్ధానికి అంతము లేకపోవడం జరిగినై. అయిదేండ్ల అనంతరం ఫ్రెంచి హైకమీషనర్ జనరల్ డిలెత్రె, డి టాసింగ్నీ (Generel De Lattre De Tassingny) తన మరణానికి పూర్వం యింకా 18 నెలల్లో యీ యుద్ధాన్ని ముగిస్తానని ఏ మాత్రం దూరదృష్టి లేకుండా అన్నాడు. ఇక యీ అయిదేండ్లలో ఫ్రాన్సు నష్టపడినవి:—1 00 000 ఆఫీసర్లు-తదితరులు; 3,000 మిల్లియన్ల డాలర్లు (మార్షల్ ప్రణాళిక క్రింద, యితరత్రా వచ్చినవి) పైగా తన ఆసియా ప్రజల్ని హింసించడం, ఇతర ఆసియాదేశాల ఆగ్రహానికి పాలుకావడం, తన దేశీయులని ఉన్మత్తులుగా మార్చడం;—చాలదూ? ఎన్నాళ్ళు యుద్ధం కొనసాగుతుంది? జవాబు ఫ్రెంచివారికే తెలుసు—ఇండో-చైనాను తిరిగి స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేయటంలో ఫ్రాన్సు యూరప్‌లో